క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 3న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. హనుమకొండ చౌరస్తా, కాకాజీ కాలనీ, హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్ రోడ్డు, అలంకార్ కూడలి, గాంధీనగర్, టైలర్ స్ట్రీట్‌లో ఉదయం 8గంటల నుంచి 10 గంటలు, విద్యారణ్యపురి, కనకయ్య హోటల్, సాయి గణేష్‌కాలనీ, కేయూ పోలీస్ స్టేషన్, సీఆర్‌పీఎఫ్ క్యాంప్, హెచ్‌పీ గ్యాస్ గోడౌన్, పలివేల్పుల ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

హసన్‌పర్తి: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గుమ్మడి రాములు డిమాండ్ చేశారు. ఈమేరకు ఇన్‌చార్జ్ తహసీల్దార్ రహీంకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా 40శాతం మంది రైతులకు రుణమాఫీ జరగలేదని పేర్కొన్నారు. సీపీఎం మండల కమిటీ సభ్యుడు అశోక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు కుమారస్వామి, శ్రీనివాస్, రాధ, సమ్మక్క, పద్మ, అనిఫా, శ్రీనవాణి, వనజ పాల్గొన్నారు.

వ్యాధులపై దృష్టి సారించండి

వరంగల్ అర్బన్: వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 24 డివిజన్లలోని స్లమ్ ఏరియాల్లోని ప్రజలు సీజనల్ వ్యాధులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని బీజేపీ ఎస్సీ మోర్చా వరంగల్ జిల్లా నాయకులు తెలిపారు. ఈమేరకు వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని బల్దియా ప్రధాన కార్యాలయంలో బల్దియా అడిషనల్ కమిషనర్ రాజేందర్ రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. పోలెపాక మార్టిన్ లూథర్, మాదాసు రాజు, అనిత, ప్రదీప్, విజయ్, రాజ్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్ష పదవి ఇంటర్వ్యూకు ఆహ్వానం



కాజీపేట: యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్ష పదవికి ఢిల్లీలో రెండు రోజులపాటు జరగనున్న ఇంటర్వ్యూలకు హనుమకొండ జిల్లా కాజీపేట పట్టణానికి చెందిన తక్కలపల్లి సాగరికకు ఏఐసీసీ నుంచి ఆహ్వానం అందింది. జాతీయ అధ్యక్ష పదవి కోసం నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు దక్షిణ భారతదేశం నుంచి, తెలంగాణ రాష్ట్రం నుంచి ఒక సాగరికకే ఆహ్వానం అందడం గమనార్హం.

టీవీవీ జిల్లా కార్యవర్గం ఎన్నిక



విద్యాసాగర్, అధ్యక్షుడు



నాగరాజు, ప్రధాన కార్యదర్శి

హసన్‌పర్తి: తెలంగాణ విద్యావంతుల వేదిక హనుమకొండ జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా హసన్‌పర్తికి చెందిన అనుమాండ్ల విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శిగా దేవసాని నాగరాజు, ఉపాధ్యక్షులుగా దారం జనార్దన్, అనురాధ, కార్యదర్శులుగా ఆనంద్, ప్రభావతి, చిర్ర శ్రవణ్, కోశాధికారిగా సునీల్ ఎన్నికైనట్లు టీవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పి.జగదీశ్వర్ ప్రకటించారు.

వివాహిత బలవన్మరణం

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి గ్రామానికి చెందిన వివాహిత కాయిత రమ్య (23) క్రిమిసంహారక మందు తాగి బలవన్మరణానికి పాల్పడినట్లు ఎస్సై శివకృష్ణ తెలిపారు. ఈమేరకు మృతురాలి తండ్రి బండి తిరుపతి సోమవారం కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2024లో రమ్యను కాయిత రాజుకు ఇచ్చి వివాహం జరిపించారు. ఇటీవల రమ్య గర్భవతి కావడంతో ఆస్పత్రిలోకి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి బలహీనంగా ఉన్న నేపథ్యంలో పిల్లలను కనడం సరికాదని చెప్పారు. దాంతో మనస్తాపానికి గురైన రమ్య.. అత్తగారింట్లో ఆదివారం క్రిమిసంహార మందు తాగింది. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం ఉదయం మృతి చెందారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

వ్యక్తి అదృశ్యం



మడికొండ: రైల్వే రిటైర్డ్ ఉద్యోగి మడికొండ గ్రామానికి చెందిన తప్పెట కట్టయ్య (58) అదృశ్యమైనట్లు ఎస్సై రాజబాబు తెలిపారు. శనివారం ఇంట్లో నుంచి బయట వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. అతడి కుమారుడు తప్పెట రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కట్టయ్య ఆచూకీ తెలిస్తే 87126 85009 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

విద్యుదాఘాతానికి గేదెలు మృతి

హసన్‌పర్తి: మేతకు వెళ్లిన రెండు గేదెలు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌లో సోమవారం జరిగింది. వంగపహాడ్‌కు చెందిన నరికె కుమారస్వామికి చెందిన రెండు గేదెలు సోమవారం ఉదయం మేతకు వెళ్లాయి. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగిలి ప్రాణాలు కోల్పోయాయి.

వైఎస్ రాజశేఖరరెడ్డికి ఘన నివాళి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని నగర వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ప్రజా సేవలను గుర్తుచేశారు.

– సాక్షి నెట్‌వర్క్



మడికొండలో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



వడ్డెపల్లిలోని ఒయాసిస్ అనాథాశ్రమంలో టిఫిన్ బాక్స్‌లు పంపిణీ చేస్తున్న మండల సమ్మయ్య



హసన్‌పర్తి: నివాళులర్పిస్తున్న నాయకులు



కాశిబుగ్గ జంక్షన్‌లో..



వెంకట్రామా జంక్షన్‌లో నివాళి అర్పిస్తున్న టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, తదితరులు



కడిపికొండలో నివాళులర్పిస్తున్న నాయకులు



22వ డివిజన్‌లో కార్పొరేటర్ కుమారస్వామి



భీమారంలో నివాళులర్పిస్తున్న నాయకులు

దక్షిణమధ్య రైల్వే జీఎం విండో తనిఖీ

కాజీపేట రూరల్ : దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలులో విండో తనిఖీ చేసుకుంటూ తాళ్లపూసపల్లి ఘటన వద్దకు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. జీఎం సికింద్రాబాద్ నుంచి రైల్వేట్రాక్ సమీప వరద నీరును పరిశీలిస్తూ వెళ్లినట్లు తెలిపారు. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 2 గంటలకు ప్రత్యేక రైలులో కాజీపేట జంక్షన్‌కు చేరుకొని కొద్ది సేపు ఆగారు. అనంతరం జీఎం ప్రత్యేక రైలు సికింద్రాబాద్‌కు బయలుదేరి వెళ్లింది.

ప్రయాణికుల భద్రతే ఆర్‌పీఎఫ్ లక్ష్యం

కాశిబుగ్గ : రైల్వే ఆస్తుల సంరక్షణతో పాటు ప్రయాణికుల భద్రత కోసం ఆర్‌పీఎఫ్ అలుపెరగని పోరాటం చేస్తోందని ఆర్‌పీఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ దేబాష్మిత సీ బెనర్జీ సోమవారం ఒక ప్రకటనలో కొనియాడారు. ఇంటికన్నె–కేసముద్రం మధ్యలో రైల్వేట్రాక్ కొట్టుకుపోవడంతో కేసముద్రం రైల్వేస్టేషన్ వద్ద రెండు సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపివేశారు. దీంతో 5,619 మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతుడటంతో వరంగల్ ఆర్‌పీఎఫ్ సిబ్బంది వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకుని ముందుగా వారికి ధైర్యం చెప్పారు. ఆర్‌పీఎఫ్ సీఐ టీఎస్ఆర్ కృష్ణ, రాజేంద్రప్రసాద్‌లు ప్రయాణికుల భద్రత లక్ష్యంగా సమీప రెవెన్యూ అధికారులు, రాజకీయ నాయకులు, వలంటీర్లు, గ్రామస్తులతో కలిసి భోజనం, వాటర్ బాటిళ్లు అందజేశారు.



ఆహారం పంపిణీ చేస్తున్న అధికారులు, పోలీసులు

ఎస్సై యాదగిరిరెడ్డి వర్ధంతి



నివాళులర్పిస్తున్న సీపీ, తదితరులు

వరంగల్ క్రైం : నక్సల్స్ చేతుల్లో మరణించిన ఎస్సై యాదగిరిరెడ్డి వర్ధంతిని సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరిరెడ్డి చిత్రపటానికి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇతర పోలీస్ ఉన్నతాధికారులు యాదగిరిరెడ్డికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ 1985 సెప్టెంబర్ 2న కాజీపేట ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న యాదగిరిరెడ్డి తన భార్యను కాజీపేట రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కించి తిరిగి వస్తున్న సమయంలో రైల్వేప్లాట్‌ఫారంపై నక్సలైట్లు కాపుకాసి కాల్పులు జరిపి అతిదారుణంగా హత్య చేసినట్లు ఆయన తెలిపారు. యాదగిరిరెడ్డి ఆశయ సాధనకు ప్రతి పోలీస్ కృషి చేయాలని, ఆయన సేవలకు గుర్తుగా కమిషనరేట్ కార్యాలయంలోని సమావేశ ప్రాంగణానికి ఎస్సై యాదగిరిరెడ్డి సమావేశ ప్రాంగణంగా నామకరణం చేస్తున్నట్లు సీపీ తెలిపారు. కార్యక్రమములో అదనపు డీసీపీ రవి, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, డేవిడ్‌రాజు, పోలీస్ సంక్షేమాధికారి ఆర్ఐ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

కాశిబుగ్గ: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నగరంలో ముంపునకు గురైన మైసయ్యనగర్, లక్ష్మీపురం, డీకేనగర్, మల్లు స్వరాజ్యం నగర్లను సీపీఎం నాయకులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు ధైర్యం చెపుతూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వాలు మారుతున్నా ప్రజల సమస్యలు తీర్చడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పేదల కాలనీలు ముంపునకు గురికాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. బాధితులకు బియ్యం, నిత్యావసరాలు, దుస్తులు, నగదు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నలిగంటి రత్నమాల, సింగారపు బాబు, అరూరి కుమార్, సాంబమూర్తి, ఆదాం, దుర్గయ్య, ప్రకాశ్, భవాని, స్వాతి, వెంకటలక్ష్మి తదితరులు ఉన్నారు.



మైసయ్యనగర్‌లో పర్యటిస్తున్న నాయకులు

నష్ట నివారణకు చర్యలు చేపట్టాలి



గాంధీనగర్‌లో భోజనం అందజేస్తున్న నాయకులు

వరంగల్: గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వలన వేలాది గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయని, ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మామిడాల భిక్షపతి, గౌని ఐలయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాచర్ల బాలరాజు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక చెరువులు తెగిపోయి వేలాది ఎకరాల పంట భూములు కోతకు గురయ్యాయని పేర్కొన్నారు. ప్రధానంగా మహబూబాబాద్, ములుగు, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, జనగామ, ఉమ్మడి నల్గొండ, నాగర్ కర్నూల్, మహబూబ్ నగర్ లాంటి జిల్లాల్లో భారీగా పంట నష్టం సంభవించిందని వివరించారు.

ముంపు బాధితులకు భోజనాల పంపిణీ

కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ 19వ డివిజన్‌లో ముంపునకు గురైన గాంధీనగర్ బాధితులకు బల్దియా ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో పునరావాసం కేంద్రం ఏర్పాటు చేసి భోజనాలు అందజేశారు. రాత్రి భోజనాలు పంపిణీ చేసిన అధికారులు, నాయకులు.. సోమవారం ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం పెట్టారు.

ఆకట్టుకుంటున్న శ్రీఉషోదయ చేనేత, హస్తకళా మేళా

హన్మకొండ అర్బన్: నగరంలోని నిట్ సమీపంలో తారా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన శ్రీఉషోదయ చేనేత, హస్తకళా మేళా నగర వాసులను విశేషంగా ఆకర్షిస్తోందని నిర్వాహకులు తెలిపారు. ఈ మేళాలో అఖిల భారత హస్తకళా, చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలు ఉన్నాయని తెలిపారు. పోచంపల్లి, బెడ్ షీట్స్, డ్రస్ మెటీరియల్స్, శారీస్, కళంకారి, మంగళగిరి, పొందురు, హైదరాబాద్ ఎంబ్రాయిడరీ చీరలు, జైపూర్ బెడ్ షీట్స్, టాప్స్, స్కర్ట్స్, తమిళనాడు చెట్టినాడు చీరలు, గుజరాత్ టాప్స్, చిన్నారుల డ్రెస్సెస్, నైటీలు, కొండపల్లి బొమ్మలు, హైదరాబాద్ ముత్యాలు, లెదర్ బ్యాగ్‌లు, ఇమిటేషన్ జ్యువెలరీ, గృహ ఉపకరణ వస్తువులు, పుస్తకాలు, రాజస్థాని మౌత్ ఫ్రెషనర్స్, తదితర వస్తువులు అందుబాటు ధరల్లో ఉన్నాయని వివరించారు. చేనేత ప్రదర్శన, అమ్మకం ఈనెల 10వ తేదీ వరకు రోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.



గాజులు కొంటున్న మహిళలు

శాస్త్రీయ నృత్యంలో సాన్వితరెడ్డి ప్రతిభ



కాజీపేట: కాజీపేట మండలం సోమిడి శివారులోని తాళ్ల పద్మావతి ఒలింపియాడ్ పాఠశాల విద్యార్థి సాన్వితరెడ్డి శాస్త్రీయ నృత్యంలో ప్రతిభ కనబరిచింది. వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం రాత్రి జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా సాన్వితరెడ్డిని తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, కళాశాల డైరెక్టర్లు తాళ్ల వంశీ, చైతన్య, అప్జలున్నీసా, సిబ్బంది సన్మానించారు.

పాకనాటి జ్యోతికి జానపద సాహిత్య పురస్కారం ప్రదానం



హన్మకొండ కల్చరల్: కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ పాకనాటి జ్యోతికి జానపద సాహిత్య పరిషత్ జానపద సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈమేరకు హైదరాబాద్ కూకట్‌పల్లిలోని కృష్ణసింధూరి సంకల్ప లలిత కళా నిలయంలో పరిషత్ అధ్యక్షురాలు డాక్టర్ సి.వసుంధరారెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగిన పరిషత్ వార్షికోత్సవంలో తెలంగాణ రాష్ట్ర పూర్వ ముఖ్యసలహాదారు కేవీ రమణాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని పాకనాటి జ్యోతికి జానపద సాహిత్య పురస్కారం ప్రదానం చేశారు.

సంక్షిప్తంగా

మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు

మడికొండ: శ్రావణమాసం చివరి సోమవారం అమావాస్య సందర్భంగా మెట్టు రామలింగేశ్వర స్వామి వారికి ప్రాతఃకాల తైలాభిషేకం నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారికి అన్నపూజ నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే, సీతారామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి శేషుభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, ధర్మకర్తలు బైరి రాజుగౌడ్, రొడ్డ దయాకర్, బోగి కేదారి, దండిగం శ్రీనివాస్, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, వస్కుల ఉమ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరాలయంలో..

కాశిబుగ్గ: శ్రావణమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని వరంగల్ కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు తెచ్చిన 54 కిలోల చక్కెరతో ఆలయంలోని సహస్ర లింగానికి అభిషేకం చేశారు. మధ్యాహ్నం కాశీ విశ్వేశ్వరుడికి అన్నపూజ చేసి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, గుండేటి కృష్ణమూర్తి, వేముల నాగరాజు, మండల శ్రీరాములు, ఓరుగంటి కొమురయ్య, వైకుంఠం, ప్రభాకర్ పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవికి బోనాలతో నైవేద్యం

కాజీపేట: నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో స్వామి వారికి భక్తులు సోమవారం బోనాలు సమర్పించారు. ఉత్సవాల మూడో రోజు పరమాన్నాన్ని అన్నపూర్ణాదేవికి నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణలో బోనాల విశిష్టత, సంప్రదాయ పద్ధతిలో బోనాలు ఆచరించే విధానం, ఆంధ్రలో తిరునాళ్ల ఆచరణలపై భక్తులకు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ వివరించారు. పూజల వల్ల కలిగే ఫలితాలను ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు రాధాకృష్ణశర్మ ఉదాహరించారు.

రుణమాఫీ ఎందుకు కాలేదు?

పెగడపల్లి సొసైటీ ఎదుట రైతుల ఆందోళన



హసన్‌పర్తి: తాము తీసుకున్న రుణాలు ఎందుకు మాఫీ కాలేదని రైతులు ప్రశ్నించారు. ఈమేరకు పెగడపల్లి సొసైటీ పరిధిలోని సీతానాగారం ప్రాంతానికి చెందిన రైతులు సొసైటీ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెగడపల్లి సొసైటీ పరిధిలోని 1,012 మంది రైతులకు సంబంధించిన రూ.9.5కోట్లు రుణాలు మాఫీ కావాల్సి ఉండగా, కేవలం ఒక్కరికే మాఫీ ఎలా అయిందని ప్రశ్నించారు. కాగా, ఆడిట్ కాకపోవడం వల్ల రుణమాఫీ నిధులు నిలిచిపోయాయని పెగడపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గోపాల్‌రెడ్డి వివరించారు.

నాలాలు మూతపడేలా నిర్మాణాలు చేపట్టొద్దు

రోడ్లను పరిశీలించిన ఎమ్మెల్యే నాయిని

హన్మకొండ చౌరస్తా: ప్రధాన రోడ్ల పక్కన ఉన్న నాలాలు (సైడ్ డ్రెయినేజీ) మూతపడేలా నిర్మాణాలు చేపట్టొద్దని దుకాణ సముదాయాల యజమాన్యాలకు ఆదేశాలు ఇవ్వాలని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సూచించారు. ఈనెల 9వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ఆర్‌అండ్‌బీ, ఎన్‌హెచ్, కుడా అధికారులతో కలిసి బాలసముద్రం రోడ్డు, నయీంనగర్ బ్రిడ్జి పనులను ఎమ్మెల్యే సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తేలికపాటి వర్షాలకు రోడ్లపై నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీస్ హెడ్‌క్వార్టర్ నుంచి యూనివర్సిటీ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా బీటీ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి స్థాయికి చేరుకుందని వివరించారు. బ్రిడ్జి నిర్మాణ ఆవరణలో సుందరీకరణ, పాదచారుల మార్గం రెండు సమాంతరంగా కొనసాగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ సురేష్‌బాబు, ఎన్‌హెచ్ డీఈఈ కిరణ్, కుడా ఈఈ భీమ్‌రావు, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే

ఉత్కంఠగా సాగిన చెస్ పోటీలు



విజేతలుగా నిలిచిన బాలబాలికతో నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మంటపంలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–11 బాలబాలికల చెస్ పోటీలు ఆద్యంతం ఉత్కంఠగా కొనసాగాయి. ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమైన పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి 70 మంది పాల్గొనగా రాత్రి 11 గంటలకు ముగిశాయి. ఒకరిని మించి మరొకరు ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ పావులు కదిపిన ఆట రసవత్తరంగా సాగింది. విజేతలకు సోమవారం ఉదయం ట్రోఫీలు, సర్టిఫికెట్లను అందజేశారు. ప్రతిభ కనబరిచిన అభినవ్‌సాయి, ఆయుష్, ఆద్విక్, జితీష్, బాలికలు జాన్వీ, వైష్ణవి, హస్మిత, అక్షయ నలుగురు బాలురు, నలుగురు బాలికలను ఈ నెల 13, 14వ తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు నిర్వహణ కార్యదర్శి పి.కన్నా తెలిపారు. కార్యక్రమంలో ఆర్బిటర్లు ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్, వైశాలి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించేందుకు పోటీలు

విద్యారణ్యపురి: విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు భారత్ వికాస్ పరిషత్ (బీవీపీ) జాతీయ బృందం గీతాల పోటీలు నిర్వహిస్తోందని సెన్సార్ బోర్డు మెంబర్ నాగేశ్వర్ అన్నారు. బీవీపీ హనుమకొండశాఖ ఆధ్వర్యంలో హనుమకొండలోని సామ జగన్మోహన్‌రెడ్డి స్మారక భవనంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు సోమవారం బృంద గీతాల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సమావేశంలో బీవీపీ హనుమకొండ శాఖ అధ్యక్షుడు డాక్టర్ సుధీర్‌కుమార్, జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు అగర్వాల్, గోవిందరాజులు, బాధ్యులు రామారావు, జయపాల్‌రెడ్డి, బీఎస్‌రెడ్డి, న్యాయ నిర్ణేతగా కీర్తి సతీష్ పాల్గొన్నారు.



పోటీల్లో పాట పాడుతున్న విద్యార్థినులు

సామాజికవేత్త, రిటైర్డ్ ప్రొఫెసర్ భద్రునాయక్ మృతి

కేయూ క్యాంపస్ : సామాజికవేత్త, కేయూ హిస్టరీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్, హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ గుగులోతు భద్రునాయక్ (70) అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మహబూబాబాద్‌లోని గిరిజన తండాలో నిరుపేద కుటుంబానికి చెందిన భద్రునాయక్ కేయూలో నాన్ టీచింగ్ ఉద్యోగిగా అడుగిడి చిరుద్యోగం చేసుకుంటూ ఉన్నత విద్యను పూర్తి చేశాడు. హిస్టరీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులై అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్ స్థాయికి ఎదిగారు. హిస్టరీ విభాగం అధిపతిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా పలు జాతీయ అంతర్జాతీయ సదస్సుల్లో 100 వరకు పరిశోధన పత్రాలను సమర్పించారు.

వృద్ధులకు చేయూతనిద్దాం

విద్యారణ్యపురి: వృద్ధులకు చేయూతనివ్వాలని సైకిల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, యోగా గురువు జంగా గోపాల్‌రెడ్డి సూచించారు. యూనివర్సిటీ రోడ్డులోని భీమారం లార్డు వృద్ధాశ్రమంలో వృద్ధుల సమక్షంలో తన జన్మదిన వేడుకలను గోపాల్‌రెడ్డి సోమవారం జరుపుకున్నారు. అనంతరం వృద్ధులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సైకిల్ వాకర్స్ కార్యదర్శి అనంత్, వాకర్స్ జిల్లా 303 గవర్నర్ ఎల్లగౌడ్, చీఫ్ కోఆర్డినేటర్ కుమారస్వామి, బాధ్యులు భారతి, లక్ష్మయ్య, యోగా సభ్యులు నరహరి, చమన్‌సింగ్, అశోక్, జంగా సుకన్య, తదితరులు పాల్గొన్నారు.

సుధానగర్‌లో వైద్య శిబిరం

హన్మకొండ చౌరస్తా: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో హనుమకొండలోని పెద్దమ్మగడ్డ ప్రభుత్వ ప్రాథమిక వైద్యకేంద్రం ఆధ్వర్యంలో 9వ డివిజన్ సుధానగర్‌లోని కమిటీ హాల్‌లో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ రోహిత్ పాల్గొని స్థానికులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. యూపీహెచ్‌సీ సూపర్‌వైజర్ ఇంద్రసేనా రెడ్డి, ఏఎన్ఎం స్రవంతి, ఆశవర్కర్ భవాని, ఎంఎన్ఓ అశోక్ పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న మార్నేని

హన్మకొండ: తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామిని తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు పూజలు నిర్వహించారు.

అన్నదానం.. మహాదానం

రామన్నపేట: అన్నదానం మహా దానమని అఖిల భారత దీక్ష ప్రచార సమితి సభ్యులు పేర్కొన్నారు. ప్రతీ అమావాస్యను పురస్కరించుకుని త్రిశూల్ ఫౌండేషన్ అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్నట్లు వివరించారు. వరంగల్ బీట్‌బజార్‌లో సోమవారం నిర్వహించిన అన్నదానం కార్యక్రమంలో శ్రీకాంత్, శ్రీనివాస్, బొజ్జ శ్రీకాంత్, శ్యామ్, రాజు, రాకేశ్, శేఖర్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం

మడికొండ: భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశాన్ని 46వ డివిజన్ మడికొండలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బండి సాంబయ్యయాదవ్ హాజరై మాట్లాడారు. పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ మునిగాల సరోజన, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, జిల్లా నాయకులు పొనగోటి వెంకట్ రావు, డివిజన్ అధ్యక్షుడు పిట్టల రమేష్, కేటిక సదానందం, బొల్లికొండ వినోద్, అజయ్, నిఖిల్ రావు, కుమార్‌బాబు, సదానందం, భాస్కర్, మల్లికార్జున్, రాజేష్, రాజ్‌కుమార్, కల్యాణ్, అరవింద్, వెంకటేష్, కిరణ్, నవీన్, తేజ పాల్గొన్నారు.

టీపీయూఎస్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం

విద్యారణ్యపురి: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) ఆధ్వర్యంలో ఈనెల 8న హనుమకొండలోని సామ జగన్మోహన్ రెడ్డి స్మారక భవన్‌లో గురుపూజోత్సవం నిర్వహించనున్నట్లు వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన కార్యదర్శులు ఉప్పుల సతీష్, డాక్టర్ మునికుంట్ల సంగెం శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన 60మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు.

త్రిపుర వరద బాధితులకు సాయం

హన్మకొండ అర్బన్: రాష్ట్ర గవర్నర్, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు జిష్ణుదేవ్ వర్మ పిలుపుమేరకు త్రిపుర వరద బాధితులకు రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వేయి కుటుంబాలకు నిత్యావసర సరుకులు, దుస్తులు, వంట సామగ్రిని తరలించే కార్యక్రమాన్ని గవర్నర్ జెండా ఊపి సోమవారం ప్రారంభించారు. అనంతరం జిష్ణుదేవ్‌కు రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యుడు శ్రీనివాస్‌రావు ఛాయాచిత్రాన్ని అందించారు. గవర్నర్ ప్రిన్సిపాల్ సెక్రటరీ బి.వెంకటేశం, తెలంగాణ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ అజయ్ మిశ్రా, ప్రధాన కార్యదర్శి శ్రీరాములు పాల్గొన్నారు.

విద్యుత్ టవర్ ఎక్కిన గుర్తు తెలియని వ్యక్తి

హన్మకొండ: హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ వద్ద ఉన్న విద్యుత్ టవర్‌ను ఓ గుర్తు తెలియని వ్యక్తి సోమవారం రాత్రి ఎక్కాడు. కాగా, మంత్రి పొన్నం ప్రభాకర్ వస్తేనే తాను కిందికి దిగుతానని సదరు వ్యక్తి భీష్మించుకుని కూర్చున్నాడు. హనుమకొండ పోలీసులు అక్కడికి చేరుకుని కిందికి దింపారు. పోలీసులు విచారించగా మద్యం మత్తులో అతడు ఏం చెప్పలేక పోయినట్లు సమాచారం.